సాక్షి వైఎస్‌ఆర్ జిల్లా

మంగళవారం, 29, ఆగస్టు, 2023



చిరుత సంచారం లేనట్లే

వెంగళాయపల్లె సమీపంలోని పంట పొలాల్లో చిరుత పులి సంచార జాడల్లేవని..ప్రజలు భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని అటవీశాఖ అధికారి తెలిపారు. - 8లో



ఈ యువతకు ఏమైంది?

జిల్లాలో పలు ప్రాంతాల్లో ప్రస్తుతం నేర సంఘటనలు నిత్యం చోటు చేసుకుంటున్నాయి. ఇందులో అత్యధికంగా యువతే ఉంటుండడం కలవరపాటుకు గురి చేస్తోంది. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.6 /28.8

జిల్లాలో సోమవారం 28.8 - 35.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 9.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

డయల్ యువర్ డీపీటీవో

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఈ నెల 30వ తేదీ సాయంత్రం 4.00 నుంచి 5.00 గంటల వరకు ఆర్టీసీ సమస్యలపై 'డయల్ యువర్ డీపీటీవో(జిల్లా ప్రజా రవాణాధికారి)' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పి.గోపాల్‌రెడ్డి తెలిపారు. జిల్లా ప్రజలు సమస్యలు, సూచనలు,సలహాలు 9959225848 నంబరుకు తెలియజేయవచ్చన్నారు.

ఆర్టీసీలో గిఫ్ట్ స్కీమ్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప–రాజంపేట మార్గంలో తిరుగుతున్న ప్రయాణీలకు సెప్టెంబరు 1వ తేదిన గిఫ్ట్ స్కీమ్‌ను ఏర్పాటు చేస్తున్నామని కడప డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు తెలిపారు. రాజంపేట నుంచి కడపకు, కడప నుంచి రాజంపేటకు ప్రయాణించే ప్రయాణీకులు వారి ప్రయాణం ముగిశాక బస్సు దిగి వెళ్లే సమయంలో వారి టిక్కెట్ వెనుకాల పేరు, సెల్ నెంబరు రాసి బస్సులో ఉన్న గిఫ్ట్ బాక్సులో వేయాలన్నారు. ప్రతినెల రెండో, నాలుగో శుక్రవారాల్లో డ్రా పద్ధతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బాధ్యతల స్వీకరణ



నాగేశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్ : వైఎస్సార్ జిల్లా చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులుగా జి.నాగేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న భీమయ్య పదోన్నతిపై ఒంగోలు రీజినల్ డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీపై వెళ్లారు. విజయవాడ ఆప్కో కార్యాలయంలో పనిచేస్తున్న నాగేశ్వరరావు సోమవారం ఇక్కడ ఏడీగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్, జేసీ, ఇతర అధికారులను మర్యాద పూర్వకంగా కలిశారు.

9న ఎస్‌ఐ నమూనా పరీక్ష

కడప స్పోర్ట్స్: కడప నగరం బాలాజీనగర్‌లోని యూత్‌హాస్టల్‌లో సెప్టెంబర్ 9వ తేదీన ఎస్‌ఐ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు నమూనా పరీక్ష నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ మణికంఠ తెలిపారు. సెప్టెంబర్ 9వ తేదీ మధ్యాహ్నం 1 గంటకు పరీక్ష జరుగుతుందన్నారు. రీజనింగ్ 40 మార్కులు, అర్థమ్యాటిక్స్ 40, కరెంట్ అఫైర్స్ 40, ఇంగ్లీషు 20, జనరల్ సైన్స్ 30, జనరల్ నాలెడ్జ్ 30 మార్కుల చొప్పున పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడామంత్రిత్వశాఖ, నెహ్రూ యువకేంద్రం, ఆధ్వర్యంలో జరిగే ఈ పరీక్షలో విజేతలకు నగదు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9177616677 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఫిర్యాదులపై స్పందించాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

కడప అర్బన్ : జిల్లాలో బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో 'స్పందన'కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ బాధితులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 'స్పందన'ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలనీ, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలనీ పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజలకు సైబర్‌క్రైమ్‌కు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా ఆన్‌లైన్ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సైబర్‌క్రైమ్.జీఓవీ.ఇన్ ద్వారా నేషనల్ సైబర్‌క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ)లో, టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయవచ్చని ఎస్పీ సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్ : పీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్(ఒకేషనల్) బోధించే అతిథి అధ్యాపకుడి పోస్టుకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ వెంకటరెడ్డి తెలిపారు. ఎంసీఏ, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ లేదా బీటెక్ కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్/ఐటీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించినవారు అర్హులన్నారు. ఆగస్టు 30వ తేదీలోగా తమ దరఖాస్తులను gjpeleruboys@gmail.comకు పంపవచ్చునని, లేదా నేరుగా కళాశాలలో అందజేయవచ్చునని తెలిపారు. ఆగస్టు 31న గురువారం తమ బయోడేటా, ధ్రువపత్రాలతో కళాశాలలో హాజరు కావాలని తెలిపారు.

పెనగలూరులో..

పెనగలూరు : పెనగలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆంగ్ల సబ్జెక్టు బోధనకు అతిథి అధ్యాపకుడు కావాలని కళాశాల ప్రిన్సిపాల్ కేవీ సుబ్బారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9440917709లో సంప్రదించాలన్నారు.

కరవు నేలలో డ్రాగన్ సిరులు

కరవు నేలలో డ్రాగన్ సిరులు పండిస్తోంది. ఏళ్లుగా సంప్రదాయ పంటలు సాగు చేస్తూ వస్తున్న అన్నదాతలు డ్రాగన్ పంటపై ఆసక్తి పెంచుకుంటున్నారు. వరుణుడు కరుణిస్తే గానీ పంట చేతికి వచ్చే పరిస్థితి లేని పొలాల్లో డ్రాగన్ విరగ్గాస్తూ రైతుకు లాభాలు కురిపిస్తోంది. దీంతో మరింత మంది ఆసక్తి కనబరుస్తున్నారు.



మాది కమలాపురం మండలం జంబాపురం గ్రామం. నా పేరు సుబ్బారెడ్డి. ఉపాధి హామీ పథకం ద్వారా అర ఎకరాలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేశాను. రెండేళ్లపాటు నిర్వహణ, స్తంభాలు, మొక్కల ధరకు కలిపి రూ.1.86 లక్షల నిధులిచ్చారు. 2021 అక్టోబరులో సాగు చేయగా, ప్రస్తుతం 1100 కిలోల పండ్ల దిగుబడి వచ్చింది. ఇప్పటి వరకు రూ. 3 లక్షల ఆదాయం వచ్చింది. ప్రభుత్వం ప్లాంటేషన్‌ను ఇంకా ప్రోత్సహించాలి.



నా పేరు ఎస్.సుబ్బయ్య. మాది బి.మఠం మండలం దిరసవంచ గ్రామం. గతేడాది అర ఎకరాలో డ్రాగన్ ఫ్రూట్ పంట సాగు చేశాను. ఇప్పటి వరకు 700 కిలోల దిగుబడి వచ్చింది. 2021లో ఉపాధి హామీ అధికారులకు దరఖాస్తు చేశా. అర ఎకరానికి రూ. 1.86 లక్షల ఆర్థికసాయం అందింది. మంచి లాభం వచ్చింది.



బి.మఠం మండలం దిరసవంచలో సాగులో ఉన్న డ్రాగన్ పంట (ఇన్‌సెట్) పంటను పరిశీలిస్తున్న అధికారులు

- పంట సాగుకు రూ.1.86 లక్షల ప్రభుత్వ ప్రోత్సాహం
- ఒక్కో రైతుకు అర ఎకరా వరకు అనుమతి
- జిల్లాలో 50 ఎకరాల్లో డ్రాగన్‌పంట సాగు

కడప సిటీ : జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కింద 23 మంది రైతులు 12 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ పంట సాగు చేస్తున్నారు. 2022–23లో ఏడుగురు రైతులు 3.5 ఎకరాల్లో ఈ పంటవేసి రాణించడంతో, 2023–24 ఆర్థిక సంవత్సరంలో 16 మంది రైతులు మరో ఎనిమిది ఎకరాల్లో సాగు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. సొంతంగా కొందరు మరింత మంది 50 ఎకరాల్లో పంట సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంట విరగ గాయడంతో రైతులు స్వయంగా అందుబాటులో ఉన్న మార్కెట్‌లోగానీ, తోపుడు బండిపై గానీ పెట్టుకుని విక్రయిస్తున్నారు. గతంలో ఒక పండు రూ.50 ఉండగా, ఇపుడు నాణ్యతను బట్టి కిలో రూ.100 పలుకుతోంది. పోషక విలువలున్న పండు కావడంతో ఆసక్తిగా కొనుగోలు చేస్తున్నారు.

పాతికేళ్ల వరకు పంట

డ్రాగన్ ఫ్రూట్ ఎడారి మొక్క. తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో బాగా పెరుగుతుంది. చీడ పీడల బెడద ఉండదు. తొలి ఏడాదిలోనే కాపునకు వస్తోంది. ఆరంభంలో దిగుబడి అంతగా లేకపోయినప్పటికీ నాలుగో ఏడాది నుంచి ఎకరాకు సగటున పది టన్నుల వరకు దిగుబడి ఇస్తోంది. తొలి ఏడాది ఎకరాకు రూ.5లక్షల వరకు పెట్టుబడి వ్యయం అవుతుండగా, ఏడాది తర్వాత ఎరువు మినహా ప్రత్యేక పెట్టుబడుల అవసరం ఉండదు. ఏడాదిలో ఆరు నెలలపాటు కాపుకు వచ్చే ఈ పంట పాతికేళ్ల వరకు దిగుబడినిస్తుంది. 3–4 ఏళ్ల వరకు మధ్యలో అంతర పంటలుగా కూరగాయలు, కలింగర, కర్బూజ, ఇతర స్వల్పకాలిక పంటలు సాగు చేసుకునే వీలుంటుంది.

సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

తక్కువ నీటితో ఎక్కువ ఆదాయం ఆర్జించాలనే లక్ష్యంతో ఉపాధి హామీ పథకం కింద ప్రతి రైతు అర ఎకరంలో డ్రాగన్ పంట సాగు చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. జాబ్ కార్డు కలిగిన సన్న, చిన్నకారు రైతులందరూ వంద శాతం రాయితీతో అర ఎకరా వరకు డ్రాగన్ పంట సాగు చేసుకోవచ్చు. గరిష్టంగా రైతుకు ఈ పథకం కింద రూ. 1.80 లక్షల వరకు రాయితీ లభిస్తుంది. సొంతంగా మొక్కల కొనుగోలుకు హెక్టారుకు రూ. 32 వేల ప్రకారం గరిష్టంగా రెండు హెక్టార్ల వరకు రాయితీ ఇస్తోంది. బిందు సేద్యం పెట్టుకుంటే 90 శాతం రాయితీ అందిస్తోంది.



అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలి



జిల్లాలో ఇప్పుడిప్పుడే డ్రాగన్ ఫ్రూట్ సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా డ్రాగన్ ఫ్రూట్ సాగుకు వంద శాతం రాయితీ లభిస్తుంది. ఒక్కొక్క రైతు అర ఎకరా వరకు సాగు చేసుకునే వీలుంది. ఆసక్తిగల రైతులు డ్రాగన్ ఫ్రూట్ సాగుకు ముందుకు వచ్చి ఆర్థికంగా పురోభివృద్ధి సాధించాలి. – యదుభూషణరెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, డ్వామా, కడప

మొబైల్ కనెక్టివిటీ కల్పించాలి

– కేంద్ర కమ్యూనికేషన్స్ అడిషనల్ సెక్రటరీకి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి లేఖ



వైఎస్ అవినాష్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ జిల్లాలోని 26 మండలాల్లో ఉన్న వంద గ్రామాల్లో మొబైల్ కనెక్టివిటీ లేదని, ఉన్నా చాలా స్లోగా ఉందని కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. ఈమేకు సోమవారం ఆయన కేంద్ర కమ్యూనికేషన్స్ అడిషనల్ సెక్రటరీ వీఎల్ కాంతారావుకు లేఖ రాశారు. తాను ఇప్పటి వరకూ మూడు పర్యాయాలు కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖామంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి వినతి పత్రాలు సమర్పించినట్లు చెప్పారు. ఈ గ్రామాల్లో మొబైల్ కనెక్టివిటీ లేకపోవడం వల్ల ప్రజలు ప్రభుత్వ పథకాలు అందుకోలేకపోతున్నారన్నారు. అన్‌కవర్డ్ విలేజెస్ ప్రాజెక్టు కింద ఈ గ్రామాల్లో 4జీ టవర్లు ఏర్పాటు చేసి మొబైల్ కనెక్టివిటీ కల్పించాలని కోరారు.

30, 31 తేదీల్లో క్రీడాపోటీలు

కడప స్పోర్ట్స్ : అఖిల భారత సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్–2023–24లో భాగంగా శాప్ ఆదేశాల మేరకు ఈనెల 30, 31 తేదీల్లో జిల్లా స్థాయి ప్రభుత్వ శాఖల సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు సెట్ప్ సీఈఓ సి. సాయిగ్రేస్, డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎస్.వి.పి.అమృత్‌రాజ తెలిపారు. 30వ తేదీన అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చదరంగం, క్రికెట్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, రెజ్లింగ్, లాన్‌టెన్నిస్ విభాగాల్లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 31వ తేదీన స్విమ్మింగ్, ఫుట్‌బాల్, హాకీ, వాలీబాల్, ఖోఖో, వెయిట్‌లిఫ్టింగ్/పవర్‌లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్, యోగ, మ్యూజిక్, డాన్స్, షార్ట్ ప్లే క్రీడల్లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో తొలి మూడుస్థానాల్లో నిలిచిన క్రీడాకారులు సెప్టెంబర్ 4 నుంచి 8వ తేదీ వరకు విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 8310170641, 9032888638 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

కడప సెవెన్‌రోడ్స్ : సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ విజయరామరాజు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిని పరిశీలించి పరిష్కారం కోసం ఆయా శాఖల అధికారులకు పంపారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో పారదర్శకంగా విచారణ నిర్వహించాలన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోగా సమస్య పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ గణేష్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్ పీడీలు ఆనంద్‌నాయక్, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రెండో విడతలో41 మందికి అక్రిడిటేషన్లు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు 2023–24 సంవత్సరానికి రెండో విడతలో 41 మందికి మీడియా అక్రిడిటేషన్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ విజయ్ రామరాజు తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ రెండవ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏ ఒక్క అక్రిడిటేషన్ దరఖాస్తును కూడా తిరస్కరించలేదన్నారు. జీఓఎంఎస్ నంబరు 38లో ఉన్న అన్ని నిబంధనలను పాటించి, అర్హత ఉన్న జర్నలిస్టులకు అక్రిడిటేషన్ ఇవ్వడానికి కమిటీ అంగీకారం తెలిపిందన్నారు. ఈ మేరకు ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా జిల్లాలో అర్హత ఉన్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలలో పనిచేస్తున్న జర్నలిస్టులకు, ఫ్రీలాన్సర్స్, వెటరన్ పాత్రికేయులలో అన్ని నిబంధనలు పూర్తిచేసిన వారికి రెండవ విడతలో 41 మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు మంజూరు చేశామన్నారు. ఈ సమావేశంలో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ కన్వీనర్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి వేణుగోపాల్ రెడ్డి, ఏపీఆర్ఓ సునీల్ సాగర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులైన సాక్షి బ్యూరో ఇన్‌ఛార్జి బాలకృష్ణారెడ్డి, సాయంకాలం ఎడిటర్ వెంకటరెడ్డి, ఈటీవీ మురళీమోహన్ గౌడ్, సాక్షి టీవీ వీడియో జర్నలిస్ట్ రాము, ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ రత్నమయ్య, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ బాలంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కిక్‌బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ



రాణించిన ఎస్.సారా

రైల్వేకోడూరు : జార్ఖండ్‌లో ఈ నెల 22వ తేదీన జరిగిన జాతీయస్థాయి కిక్‌బాక్సింగ్ పోటీల్లో రైల్వేకోడూరు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్ సాధించారు.నేషనల్ చాంపియన్‌షిప్‌లో అండర్ –14లో ఎస్.సారా, అండర్ 16 లో వై.యశ్విని విజేతలుగా నిలిచారు. విద్యార్థులను సోమవారం ప్రధానోపాధ్యాయుడు వెంకటసుబ్బయ్య, సీడీ జయలక్ష్మి, పీఈటీ మయూరి, కోచ్ మౌలా సత్కరించి అభినందించారు.

విద్యతోనే సమాజాభివృద్ధి

- మూడో విడత విద్యా దీవెన కింద 42,989 మందికి లబ్ధి
- తల్లుల ఖాతాల్లో రూ. 31.67 కోట్లు జమ



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ విజయరామరాజు తదితరులు

కడప సెవెన్‌రోడ్స్ : విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం పిల్లల చదువులు తల్లిదండ్రులకు ఏమాత్రం భారం కాకూడదని జగనన్న విద్యా దీవెన పథకాన్ని అమలు చేస్తోంది. సోమవారం చిత్తూరు జిల్లా నగరి బహిరంగసభ నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానం ద్వారా మూడోవిడత ద్వారా విద్యాదీవెన లబ్ధి మొత్తాన్ని బటన్ నొక్కి అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేశారు. 2022–23 విద్యా సంవత్సరానికిగాను జిల్లాలో 42,989 మంది విద్యార్థులను అర్హులుగా గుర్తించారు. వీరి తల్లుల ఖాతాల్లో రూ. 31,67,28,121లు ముఖ్యమంత్రి జమ చేశారు. కలెక్టరేట్ వీసీ హాలు నుంచి ఈ కార్యక్రమాన్ని వీక్షించిన కలెక్టర్ విజయరామరాజు అనంతరం మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఏపీ హజ్ కమిటీ చైర్మన్ గౌసులాజం, రాష్ట్ర పీఆర్‌శాఖ సలహాదారు నాగార్జునరెడ్డి, ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటసుబ్బమ్మ, పూసర్ల కార్పొరేషన్ డైరెక్టర్ విజయకుమారి, రాష్ట్ర విద్యా సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ నాగమల్లిక, కేంద్ర మిషన్ శక్తి కమిషన్ సభ్యురాలు మూలే సరస్వతి, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ తదితరులు పాల్గొన్నారు.

బృహత్తర పథకం



నంద్యాలకు చెందిన నేను మరియాపురం ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నాను. విద్యారంగానికి పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందించే లక్ష్యంతో జగనన్న విద్యా దీవెన అనే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యా ప్రధాతగా ఆంధ్ర రాష్ట్ర చరిత్రలోనే సుస్థిరస్థానం సంపాదించారు.

– వై.భార్గవి, గీతాంజలి నర్సింగ్ కళాశాల, కడప

సీఎం ఇచ్చిన వరం



ప్రభుత్వం అందిస్తున్న విద్యా దీవెన పథకం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాలాంటి వారికి ఇచ్చిన వరంగా భావిస్తున్నాం. చివరి సంవత్సరంలో విద్యా దీవెన ద్వారా ఫీజు రీఎంబర్స్‌మెంట్ మొత్తం నా తల్లి ఖాతాలో జమ అయింది. చదువుకోవడానికి ఆర్థిక ఇబ్బందులు పడే మాలాంటి వారికి ఈ పథకం ఓ వరం.

– సమీర, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, కడప

తల్లులకు ప్రాధాన్యత



మాది కర్నూలుజిల్లా బేతంచర్ల. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి విద్యా వ్యవస్థలో అనూహ్యమైన మార్పులు వస్తున్నాయి. విద్యార్థుల్లో చదువు పట్ల మరింత ఇష్టాన్ని పెంచుతున్నారు. ముఖ్యంగా విద్యార్థుల తల్లులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచుతున్నారు.

– సుజాత, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, కడప

అ'ద్వితీయ' పురస్కారం

- 574 పాయింట్లతో క్రీడా ప్రతిభా అవార్డుకు ఎంపిక
- కడప మున్సిపల్ స్కూల్ ఘనత



శిక్షణ ఇస్తున్న వ్యాయామ ఉపాధ్యాయురాలు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని మున్సిపల్ హైస్కూల్ (మెయిన్)కు ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రతిభా పురస్కారం దక్కింది. రాష్ట్ర స్థాయిలో 574 పాయింట్లు సాధించి ఈ ఏడాది ద్వితీయ స్థానంలో నిలిచి రాయలసీమలో క్రీడా పతాకాన్ని ఎగుర వేసింది. 1857లో ఏర్పాటుచేసిన ఈ నగర పాలకోన్నత పాఠశాల(ప్రధాన) నుంచి ఐఏఎస్, ఐపీఎస్‌లతోపాటు ఎందరో ఉన్నత స్థాయికి చేరారు. చదువుల్లోనేగాక ఈ ఏడాది క్రీడల్లోనూ ప్రత్యేకత నిలుపుకొని జిల్లా, రాయలసీమ స్థాయిలో అగ్రస్థానంలోనూ, రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలోనూ నిలిచి సత్తా చాటింది.

వరుసగా రెండో యేడాది..

రాష్ట్ర స్థాయి పురస్కారం వరుసగా రెండోసారి దక్కించుకున్న ఘనత మున్సిపల్ హైస్కూల్ (మెయిన్)దే. అండర్–14, అండర్–17 విభాగాల్లో రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ ఒక్క పాఠశాల నుంచే 104 మంది విద్యార్థులు పాల్గొనడం, 24 పతకాలు సాధించి రాణించడమే ఇందుకు కారణం. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో 574 పాయింట్లతో ద్వితీయ స్థానంలో నిలి ప్రత్యేకతను చాటింది. ఇది వరకే రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్ లోనూ పాఠశాలకు రాష్ట్ర స్థాయి ద్వితీయ స్థానం లభించడం విశేషం. పాఠశాల వ్యాయామోపాధ్యాయురాలు ఎల్. వెంకటలక్ష్మి క్రీడాకారుల కోసం శ్రమిస్తుండడతో విద్యార్థులు రాణిస్తున్నారు.

మెరికల్లాంటి క్రీడాకారులున్నారు



పాఠశాలలో మెరికల్లాంటి క్రీడాకారులున్నారు. తగిన విధంగా శిక్షణ ఇస్తుండటంతో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో యేటా పతకాలు సాధిస్తున్నా. వరుసగా రెండో ఏడాది ద్వితీయ స్థానంలో నిలవడం సంతోషంగా ఉంది.

– ఎల్.వెంకటలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్, మున్సిపల్ హైస్కూల్(మెయిన్), కడప

వరుస పురస్కారాలు రావడం సంతోషంగా ఉంది



ఏటా పాఠశాలకు జిల్లా స్థాయిలో క్రీడా ప్రతిభా పురస్కారం లభించడంతోపాటు వరుసగా రెండో ఏడాది రాష్ట్ర స్థాయి క్రీడా ప్రతిభా పురస్కారానికి ఎంపిక కావడం సంతోషంగా ఉంది. చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తూ ఉపాధ్యాయులు అంకితభావంతో కృషిచేస్తుండటం అభినందనీయం.

– పి. నాగమణి, ప్రధానోపాధ్యాయురాలు, మున్సిపల్ హైస్కూల్ (మెయిన్), కడప

98 శాతం ఆధార్ సీడింగ్

కడప సిటీ : ఉపాధిహామీ పథకంలో జిల్లాకు సంబంధించి ఇప్పటి వరకు 98 శాతం వేతన జీవుల బ్యాంకు ఖాతాకు ఆధార్‌కార్డు సీడింగ్ చేసినట్లు డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి తెలిపారు. కేంద్ర గ్రామీణ అభివృద్ధిశాఖ ఆదేశాల మేరకు ఈ నెల 31వ తేదీ వరకు ఆధార్ అనుసంధానం చేసుకునేందుకు గడువు ఉందన్నారు. ఇప్పటి వరకు 98 శాతం కాగా మరో రెండు శాతం చేయాల్సి ఉందని, సాంకేతిక కారణాల వల్ల పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. అయినప్పటికీ వేతన జీవులు భయపడాల్సిన అవసరం లేదని, వారికి కూడా పని కల్పిస్తామన్నారు. వీరికి మాత్రం ఆధార్‌సీడింగ్ తర్వాతే వారి అకౌంట్లకు డబ్బులు జమ అవుతాయని తెలిపారు.

క్లుప్తంగా

9న జాతీయ లోక్‌అదాలత్


మాట్లాడుతున్న జడ్జి ప్రదీప్‌కుమార్

కడప అర్బన్ : జిల్లా వ్యాప్తంగా సెప్టెంబరు 9వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి ఎం.ప్రదీప్‌కుమార్ తెలిపారు. కడప జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో సోమవారం పోలీసు అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యే విధంగా అధికారులు కృషి చేయాలని కోరారు. మరింత సమాచారం కోసం 08562- 258622, 244622 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి జె.హేమస్రవంతి, సెకండ్ ఏడీఎం కోర్టు న్యాయమూర్తి కె.భార్గవి తదితరులు పాల్గొన్నారు.

గొర్రె పిల్లలపై వీధి కుక్కల దాడి



వీరపునాయునిపల్లె : మండలంలోని గంగిరెడ్డిపల్లె గ్రామంలో సోమవారం వీధి కుక్కలు చేసిన దాడిలో 11 గొర్రె పిల్లలు మృతి చెందినట్లు గొర్రెల కాపరి పూసోల్ల బాబు తెలిపారు. గొర్రె పిల్లలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంచెలో రోజు మాదిరిగానే వదిలేశామన్నారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం 3గంటల సమయంలో కుక్కలు దాడిచేశాయన్నారు. ఈ విషయాన్ని పశు వైద్యాధికారిణి సుస్మితకు తెలియజేశామన్నారు. ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

ఈ యువతకు ఏమైంది?

ప్రొద్దుటూరు పట్టణంలోని గౌతం హైస్కూల్ పక్క సందులో నడిచొస్తున్న ఓ మహిళ మెడలోని బంగారు తాళిబొట్టు సరుడును లాక్కొని పరారయ్యాడు ఓ యువకుడు. తాజాగా జైలు శిక్ష పడి కటకటాల పాలయ్యాడు.

మదనపల్లె పట్టణంలో జనవరి నెలలో పలు ప్రాంతాల్లో జరిగిన ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడిన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఇందులో 25 నుంచి 30 సంవత్సరాల యువకులే ఉన్నారు.

మదనపల్లెకు చెందిన ఓ యువకుడు నకిలీ రికార్డులు తయారు చేసిన ద్విచక్ర వాహనాన్ని విక్రయిస్తుంచాడు. ఈ కేసులో పోలీసపులు ఇద్దరి అరెస్టు చేయగా అందులో ఓ యువకుడు కంప్యూటర్ కేంద్రం నిర్వహకుడు. చివరకు పోలీసులకు చిక్కి జైలుపాలయ్యాడు.

- చెడు మార్గంలో యువత..
- ఆందోళన వ్యక్తం చేస్తున్న విద్యావేత్తలు

మదనపల్లె సిటీ : జిల్లాలో పలు ప్రాంతాల్లో ప్రస్తుతం ఇలాంటి సంఘటనలు నిత్యం చోటు చేసుకుంటున్నాయి. నేరాల్లో అత్యధికంగా యువతే ఉంటుండడం కలవరపాటుకు గురి చేస్తోంది. పిల్లలపై పెద్దల పర్యవేక్షణ కొరవడటం, వారితో తగినంత సమయం గడపలేకపోవడం వంటివి ఈ తరహా ప్రవర్తనకు కారణమవుతున్నాయి. అరచేతిలో ఇమిడిన సాంకేతిక ఆయుధం సెల్‌ఫోన్ దీనికి మరింత ఆజ్యం పోస్తోంది.. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. పిల్లలే ప్రపంచంగా కష్టపడుతున్న తల్లిదండ్రులు వారితో చక్కగా మెలిగితే.. మనసు విప్పి మాట్లాడగలిగితే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని పోలీసులు అధికారులు, మానసిక వైద్య నిపుణులు, విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.


యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న మదనపల్లె డీఎస్పీ కేశప్ప

- మదనపల్లె పట్టణంలో సంచలనం కలిగించిన అధ్యాపకురాలు హత్యలో కూడా ప్రధాన నిందితులు యువకులు కావడం గమనార్హం.
- సాంకేతికతను ఉపయోగించి సైబర్ నేరాల్లో నిందితులుగా చిక్కుతున్న వారిలో ఎక్కువగా ఇంజనీరింగ్ విద్యార్థులు కావడం ఆందోళన కలిగిస్తోంది.

నైతిక విలువలు ప్రధానం



పిల్లలకు మార్కులు కాదు. బిహేవియర్ క్వాలిటీస్ ప్రధానం. నైతిక విలువలు బోధించే పెద్దలు ఇంట్లో లేకపోవడం కూడా ఇబ్బందులకు కారణమవుతోంది. నీతి శతకాలు,పురాణగాథలు చిన్నారులను సన్మార్గంలో నడిపించడానికి ఎంతో ఉపకరిస్తాయి.

-జల్లా లలితమ్మ, బాలల హక్కుల ఐక్యవేదిక అధ్యక్షురాలు

విలువలు నేర్పించాలి



పిల్లలకు చిన్నప్పటి నుంచే విలువలు నేర్పించాలి. దీని బాధ్యత తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు తీసుకోవాలి. పిల్లలు అధిక సమయం పాఠశాలల్లో గడుపుతారు. వారికి నీతి కథలు,మంచి,చెడు గురించి సూక్తులు బోధించాలి.

-బాలకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్,ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ, మదనపల్లె

సమాజానికి ఇవి పెను సవాళ్లే



యువత వ్యసనాలకు లోనై నేరమార్గం వైపు అడుగులు వేస్తున్నారు. మద్యం, చదువులకు క్రమంగా దూరమై కొత్తదనం కోరుకుంటూ నేరపూరిత వాతావరణంలోకి జారిపోతున్నారు. విలువలు, సామాజిక బాధ్యతతో కూడిన ప్రవర్తనను నేర్పేందుకు తల్లిదండ్రులు పిల్లలతో ఎక్కువ సమయం గడపాలి.

- చాముండేశ్వరి, సైకాలజిస్టు, మదనపల్లె

అనర్థాలపై యువకులకు అవగాహన



నేరాల వల్ల జరిగే అనర్థాల గురించి యువకులకు అవగాహన కల్పిస్తాం. ఇప్పటికే పాఠశాలలు, కాలేజీలలో అవగాహన సదస్సులు నిర్వహించాం. యువత మంచి మార్గంలో నడవాలి. పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలి. వారిని వదిలేస్తే చెడుదారుల్లో తిరుగుతూ నేరాలకు పాల్పడతారు.

-కె.కేశప్ప, డీఎస్పీ,మదనపల్లె

నకిలీ ఏజెంట్లను నమ్మి మోసపోవద్దు

- గల్ఫ్ దేశాలకు వెళ్లేవారికి జాగ్రత్తలు అవసరం
- జిల్లా ఎస్పీ కేకేఎన్.అన్బురాజన్



కడప అర్బన్ : జీవనోపాధి, ఉద్యోగం, వ్యాపారం, ఇతర ప్రయోజనాల దృష్ట్యా గల్ఫ్, ఇతర దేశాలకు వెళ్లే జిల్లా వాసులు నకిలీ ఏజెంట్లను నమ్మి మోసపోవద్దని జిల్లా ఎస్పీ కేకేఎన్.అన్బురాజన్ హెచ్చరించారు. ప్రజలను అప్రమత్తం చేసే దిశగా సోమవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం ద్వారా లేదా రిజిస్టర్డ్ రిక్రూటింగ్ ఏజెంట్ల ద్వారా విదేశాలకు వెళ్లాలని సూచించారు. అక్రమ పద్ధతుల్లో కువైట్, సౌదీ, ఖతర్ తదితర దేశాలకు వెళ్లిన వారికి సరైన వసతి, భోజనం, జీతం, ఇతర సౌకర్యాలు లేక శారీరక, మానసిక వేధింపులకు గురవుతున్నారని తెలిపారు. అమాయక మహిళలను మోసంచేసి వారి వద్ద నుంచి అధిక మొత్తంలో డబ్బు వసూలు చేస్తున్నారని వివరించారు. వీసా నియమాలపై అవగాహన లేక కొంత మంది విదేశీ జైళ్లలో శిక్ష అనుభవిస్తున్నారని, మరింత మంది భారత రాయబార కార్యాలయాల్లో ఉన్నారని పేర్కొన్నారు. వీసా, స్టాంపింగ్, ప్రాసెస్, పీసీపీ, మెడికల్ ప్రాసెస్, విమాన టికెట్, ఇతరత్రా విషయాలన్నీ ప్రభుత్వం, రిజిస్టర్డ్ రిక్రూటింగ్ ఏజెంట్ల ద్వారా పూర్తి చేసుకోవాలని పేర్కొన్నారు. విదేశాలలో ఉంటూ ఇబ్బంది పడుతున్నవారు తమ వివరాలను మదద్ వెబ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా మోసం చేసినట్లయితే సదరు సమాచారాన్ని స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ సెల్ నంబరు 9121100650కు లేదా 8309184933కు తెలియజేయాలని జిల్లా ఎస్పీ కేకేఎన్.అన్బురాజన్ సూచించారు.

నగరిగుట్టలో నాకాబందీ


నగరిగుట్టలో నాకా బందీ నిర్వహిస్తున్న డీఎస్పీ వినోద్ కుమార్, తదితరులు

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని నగరిగుట్ట ప్రాంతంలో సోమవారం పులివెందుల డీఎస్పీ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు పులివెందుల పట్టణంలోని అనుమానాస్పద స్థావరాలపై తనిఖీలు నిర్వహించామన్నారు. పట్టణంలోని నగరిగుట్ట, క్రిష్టియన్‌లైన్, యర్రగుడిపల్లె ప్రాంతాల్లో సోదాలు నిర్వహించామన్నారు. ముఖ్యంగా అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. తప్పు చేస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాటుసారా, అక్రమ మద్యం అరికట్టడంలో భాగంగా ఇప్పటివరకు 80 కేసులు నమోదు చేసి 100 మందికి పైగా అరెస్టు చేయడంతో పాటు పలు బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. అసాంఘిక కార్యకలాపాల గురించి సమాచారం తెలిస్తే వెంటనే 9121100544, 9121100546, 9121100547 నెంబర్లకు సమాచారం అందించాలన్నారు. పులివెందుల అర్బన్ సీఐ రాజు, వేంపల్లె సీఐ వెంకటేశ్వర్లు, ఆర్కేవ్యాలీ సీఐ గోవింద రెడ్డి, ఎస్సైలు సత్యనారాయణ, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

అమృతానగర్‌లో కార్డెన్ అండ్ సెర్చ్

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని అమృతానగర్‌లో సోమవారం ఉదయం పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. రూరల్ ఇన్‌చార్జి సీఐ యుగంధర్, టూటౌన్ సీఐ ఇబ్రహీం, త్రీటౌన్ సీఐ నారాయణ యాదవ్, సిబ్బందితో కలసి క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా రికార్డులు లేని 20 మోటార్ బైక్‌లను, 3 ఆటోలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. అనుమానాస్పద, కొత్త వ్యక్తులు ఎవరైనా వీధుల్లో సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో రాజుపాళెం ఎస్ఐ రాజగోపాల్ పాల్గొన్నారు.

దుకాణాల్లో విజిలెన్స్ అధికారుల దాడులు


స్వాధీనం చేసుకున్న సిగరెట్లతో విజిలెన్స్ అధికారులు

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలో విజిలెన్స్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో ప్రభుత్వానికి పన్ను చెల్లించకుండా విక్రయిస్తున్న విదేశీ బ్రాండ్లకు చెందిన 18 రకాల సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రొద్దుటూరులో పెద్ద ఎత్తున నకిలీ సిగరేట్లు విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో కడప రీజినల్ విజిలెన్స్ అధికారి షేక్ మాసూంబాషా ఆదేశాల మేరకు ఈ దాడులు జరిగాయి. కోనేటికాల్వవీధిలోని దరిశ సుబ్బారావు దుకాణంలో రెవెన్యూ, లీగల్ మెట్రాలజీ అధికారులు దాడులు చేసి 5 అట్టపెట్టెల్లో 18 రకాల విదేశీ కంపెనీలకు చెందిన సిగరేట్లను స్వాధీనం చేసుకున్నారు. వీటిపై ఎమ్మార్పీ, హెచ్చరికలు లేవన్నారు. తనిఖీల్లో 4080 సిగరేట్ ప్యాకెట్లను సీజ్ చేశామన్నారు. వీటి విలువ సుమారు రూ. 7,57,305 ఉంటుందని తెలిపారు. వ్యాపారి దరిశ సుబ్బారావుపై కేసు నమోదు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. దాడుల్లో సీఐ ఈదురుబాషా, శ్రీనివాసులు, విజయ్‌కిశోర్, సాయిప్రసాద్ రావు, కనకరత్నమ్మ, కానిస్టేబుళ్లు సుదర్శన్‌రెడ్డి, రంతుబాషా పాల్గొన్నారు.

వీఆర్‌ఎల్ పార్సిల్ సర్వీస్‌లో పట్టుజరీ చోరీ

మదనపల్లె : వీఆర్‌ఎల్ ప్రైవేట్ పార్సిల్ కొరియర్ సర్వీస్‌లో లక్షల రూపాయల విలువైన పట్టుజరీని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని పుంగనూరురోడ్డులోని వీఆర్‌ఎల్ కొరియర్ పార్సిల్ సంస్థకు ఇతర ప్రాంతం నుంచి చేనేత కార్మికులు పట్టుచీరల తయారీలో వినియోగించే జరీ 150 కిలోలు పార్సెల్ రూపంలో వచ్చింది. దాదాపుగా నెలరోజుల క్రితం పార్సెల్ సంస్థ కార్యాలయాన్ని పుంగనూరు రోడ్డు నుంచి ఇండస్ట్రియల్‌ఎస్టేట్‌కు మార్చారు. ఈ క్రమంలో చేనేత కార్మికుల కోసం పార్సిల్ రూపంలో వచ్చిన 150కిలోల జరీ మాయమైంది. ఈ విషయం గుర్తించిన మేనేజర్ హరిచరణ్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. 150కిలోల పట్టుజరీ విలువ దాదాపుగా రూ.5.32లక్షలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ సీఐ తెలిపారు.

చైన్ స్నాచింగ్ కేసులో ముద్దాయికి జైలు శిక్ష


ముద్దాయి పఠాన్‌మీర్‌ఖాన్‌తో పోలీసులు

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని ఓ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును లాక్కెళ్లిన కేసులో ముద్దాయికి ప్రొద్దుటూరు కోర్టు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధించింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని వైఎంఆర్ కాలనీలో నివాసం ఉంటున్న పాలగిరి సుబ్బరత్నమ్మ 2014 డిసెంబర్ 11న గౌతమ్ హైస్కూల్ పక్క వీధిలో నడుచుకుంటూ వెళ్తుండగా ఒక వ్యక్తి ఆమె మెడలోని తాళిబొట్టు సరుడును లాక్కొని వెళ్లాడు. ఆమె ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా కడపలోని బెల్లంమండి వీధికి చెందిన పఠాన్ మీర్‌ఖాన్ చైన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు అప్పటి ఎస్ఐ మహేష్ నిర్ధారించారు. ఈ మేరకు అతన్ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. తుది తీర్పులో భాగంగా నేరం రుజువు కావడంతో ముద్దాయి పఠాన్‌మీర్‌ఖాన్‌కు సోమవారం ఏజేఏఫ్‌సీఎం కోర్టు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 1000 జరిమానా విధించింది.

చిరుత సంచారం లేనట్లే!


కాలి ముద్రలను పరిశీలిస్తున్న ఫారెస్టు డిప్యూటీ రేంజర్ చంద్రశేఖర్ రావు

రాజుపాళెం : రాజుపాళెం మండలంలోని వెంగళాయపల్లె సమీపంలోని పంట పొలాల్లో చిరుత పులి సంచార జాడల్లేవని.. అక్కడికి వెళ్లే రైతులు, ప్రజలు ఎటువంటి భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని ముద్దనూరు అటవీశాఖ డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్ ఎస్.చంద్రశేఖర్ రావు స్పష్టం చేశారు. ఆ ప్రాంతంలోని మొక్క జొన్న పంట పరిసర ప్రాంతాలను సోమవారం చంద్రశేఖర్‌రావు, బీట్ ఆఫీసర్ సుప్రజ, రైతులు, గ్రామస్తులతో కలసి కాలిముద్రలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలి ముద్రల ప్రకారం హైనా, నక్క, తోడేలు వంటి జాతుల జంతువులు సంచరిస్తున్నట్లుగా తెలుస్తోందన్నారు. మొక్క జొన్న రైతు జగన్నాథరెడ్డితో మాట్లాడి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటి ఆధారంగా ఏ జంతువు అనేది త్వరలో తేలుస్తామన్నారు. ఈ గ్రామాల పరిధిలో కొండలు కానీ, అడవులు కానీ లేవని, అలా ఉన్నట్లయితే చిరుత లేదా పులుల సంచారం ఉండే అవకాశం ఉంటుందని చెప్పారు.

కడపోత్సవాలతో భాషా ఘనతను చాటుదాం




పురస్కార గ్రహీతలతో గానుగపెంట హనుమంతరావు

కడప కల్చరల్ : కడపోత్సవాల ద్వారా జిల్లా భాషా సంస్కృతి, చరిత్రను చాటిన డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి స్ఫూర్తితో ఆ ఉత్సవాలను మళ్లీ నిర్వహించి జిల్లాలోని సిసలైన తెలుగు భాషను మరో మారు ప్రపంచానికి చాటే ప్రయత్నం చేయాలని ప్రముఖ సాహితీవేత్త విద్వాన్ గానుగపెంట హనుమంతరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలుగు భాషా వికాస ఉద్యమం, మహా కవయిత్రి మొల్ల సాహితీ పీఠం, ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఉమ్మడి ఆధ్వర్యంలో సోమవారం కడప నగరంలోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జిల్లాలో అచ్చమైన తెలుగు భాష ఉందని, ఏ ఇతర రాష్ట్రాల ప్రభావం లేకపోవడం గమనించాలన్నారు.

పురస్కారాల ప్రదానం

ఈ సందర్భంగా జిల్లాలో తెలుగు భాషాభివృద్ధికి సామాజిక సేవకు అంకితమైన సాహితీవేత్త డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరా చారి, పద్య కవి కుందారపు గురుమూర్తి, ప్రముఖ బాల సాహిత్యవేత్త డీకే చదువులబాబు, వివేకానంద సేవాశ్రమ నిర్వాహకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి లకు భాషారత్న బిరుదు ప్రదానం చేసి శాలువతో సత్కరించి జ్ఞాపిక, నగదులను అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, బ్రౌన్ గ్రంథాలయ సంస్థ సలహా మండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ పర్యవేక్షణలో సభ కొన్ని తీర్మాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.చెన్నారెడ్డి, రామమూర్తి నాయుడు, నూనె నగేష్, పెండ్లిమర్రి మల్లయ్య, చెంచురెడ్డి, పి.శ్రీనివాసులు, స్వర్ణలత, గాయత్రి, ఈశ్వరమ్మ తదితరులు కూడా మాట్లాడారు.

యువకుడి దారుణ హత్య



గంగులయ్య మృతదేహం, ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

దువ్వూరు : మండలంలోని నేలటూరు గ్రామంలో సోమవారం తెల్లవారుజామున చిన్నముగోళ్ల గంగులయ్య (27) అనే యువకుడిని గ్రామ సమీపంలోని పొలాల్లో గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేశారు. వృత్తిరీత్యా గంగులయ్య డ్రైవర్. కొంతకాలంగా భార్యతో దూరంగా ఉంటున్న ఇతను మరో మహిళతో వివాహేతర బంధంలో ఉన్నట్లు స్థానికుల సమాచారం. హత్య విషయాన్ని గ్రామస్తుల ద్వారా సమాచారం తెలుసుకున్న మైదుకూరు ఇన్‌చార్జి డీఎస్పీ మహబూబ్‌షరీఫ్, మైదుకూరు అర్బన్, రూరల్ సీఐలు శ్రీనాథ్‌రెడ్డి, చలపతి, ఎస్ఐ శ్రీనివాసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీం సంఘటన స్థలానికి పిలిపించి రక్తన మూనాలను సేకరించినట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. కాగా వివాహేతర బంధమే హత్యకు కారణమని.. ఇప్పటికే నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు

అట్లూరు : మండల పరిధిలోని మాడపూరు చెరువు కట్టపై రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. కోనరాజుపల్లెకు చెందిన కాకర్లరామకృష్ణ, ఉత్తరప్రదేశ్‌కు చెందిన అమర్ తమ ద్విచక్ర వాహనాల్లో ఎదురెదురుగా వస్తూ మాడపూరు చెరువు కట్టపై ఢీకొన్నాయి. ఇందులో రామకృష్ణ, అమర్‌లకు గాయాలయ్యాయి. 108 వాహనంలో వారిని బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఉరి వేసుకుని యువతి మృతి


ముంతాజ్ మృతదేహం

పెండ్లిమర్రి : మండలంలోని వెల్లటూరు గ్రామానికి చెందిన ముంతాజ్ (18) అను యువతి సోమవారం తెల్లవారుజామున ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. ముంతాజ్ తల్లి కువైట్‌లో ఉంది. ఆదివారం రాత్రే తల్లితో ఫోన్‌లో మాట్లాడింది. ఏమైందో ఏమో తెల్లవారుజాము సమయంలో ఉరేసుకుంది. పని నిమిత్తం కడపకు వెళ్లిన తండ్రి దర్బార్ బాషా రాత్రికి ఇంటికి రాలేదు. ముంతాజ్ తమ్ముడు రాత్రి మిద్దెపై పడుకున్నాడు. సోమవారం ఉదయం లేచి తలుపులు కొట్టాడు. ఎంత సేపటికి తలుపులు తెరవకపోవడంతో తలుపులు పగలగొట్టి చూడగా అప్పటికే ఉరేసుకొని చనిపోయింది. మృతికి గల కారణాలు తెలియరాలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కరెంట్ షాక్‌తో బేల్దారి..


కరెంట్ షాక్‌తో మృతి చెందిన కుళాయప్ప

పెద్దముడియం : మండలంలోని భూతమాపురం గ్రామంలో గుర్రాల సాయి కుళాయప్ప (36) అనే బేల్దారి కరెంట్ షాక్‌తో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. నంద్యాల జిల్లా అక్కంపల్లె గ్రామానికి చెందిన కుళ్లాయప్ప బేల్దారి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇతనికి భార్య,ఒక కుమారుడు,ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుళ్లాయప్ప మండలంలోని భూతమాపురం గ్రామంలో ఇంటి గోడకు గోడకు నీరు పట్టే సమయంలో మోటర్‌కు ఉన్న పైపు ఊడిపోయింది. దీంతో కుళాయప్ప మోటర్‌కు పైపు తగిలిస్తుండగా కరెంట్ షాక్ కొట్టడంతో మృతి చెందినట్లు ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు.మృతుని భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

టీడీపీ నేత ఫామ్‌హౌస్‌లో పోలీసుల తనిఖీ


ముంబై డ్రగ్స్ మాఫియా సేదతీరిన టీడీపీ నేత ఫామ్‌హౌస్‌ను తనిఖీ చేస్తున్న డీఎస్పీ, సీఐ

రాయచోటి: ముంబై డ్రగ్స్ మాఫియా ముఠా సభ్యుడు విడిది చేసిన టీడీపీ నేత ఫామ్‌హౌస్‌ను రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా, అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తనిఖీలు నిర్వహించారు. సోమవారం రాయచోటి-రాజంపేట మార్గంలోని ఒడివీడు సమీపంలో ఉన్న టీడీపీనేత ఫామ్‌హౌస్‌ను వారు క్షుణ్ణంగా పరిశీలించారు. డ్రగ్స్ మాఫియాతో టీడీపీ నాయకులకు సంబంధాలు ఉన్నాయన్న ప్రచారం ఆ పార్టీ నాయకులను కలవరపాటుకు గురిచేస్తోంది. మరోవైపు కేసు నుంచి బయటపడేందుకు ఆ పార్టీ సీనియర్ నేతల నుంచి పోలీసులపై ఒత్తిడిలు తెస్తున్నట్లు సమాచారం. వారం రోజుల కిందట డ్రగ్స్ మాఫియా సభ్యుడిని ముంబై పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. అతని అరెస్టుతో పాటు అక్కడే ఉన్న కొంత మాదక ద్రవ్యాన్ని కూడా ముంబై పోలీసులు స్వాధీనం చేసుకుని పట్టుకెళ్లారు. డ్రగ్స్ ముఠా మాఫియాతో టీడీపీ నేతకున్న సంబంధాలపైన కూడా పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు. ఆశ్రయం కల్పించిన ఆ టీడీపీ నేతకు చెందిన సిమ్ కార్డులను స్వాధీనం చేసుకొని పరిశీలన చేస్తున్నట్లు రాయచోటి అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. వారి కుటుంబసభ్యుల సెల్‌ఫోన్ నెంబర్లను కూడా పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. విడిది చేసిన ఫామ్‌హౌస్‌ను, పరిసర ప్రాంతాలను కూడా పరిశీలించి పలు అనుమానాలను నివృత్తి చేసుకున్నామని పోలీసు అధికారులు చెబుతున్నారు. మాఫియా ముఠా పరిస్థితులపై ముంబై పోలీసులు అందించే సమాచారం కోసం వేచిచూస్తున్నామని సీఐ తెలిపారు. డ్రగ్స్ మాఫియా సభ్యుడితో టీడీపీ నేతకున్న సంబంధాలు, ఈ ప్రాంతంలో ఇతరులతో ఉన్న వ్యాపార సంబంధాల పైన కూడా మా కోణంలో విచారణ చేస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు.